వాయిస్



# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ నేతల వ్యాఖ్యల్లో డొల్లతనం

**విద్యార్థుల ఖాతాల్లోకే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు**

**బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి**

**కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది**



కరీంనగర్, ఆగస్టు 21 (వాయిస్ టుడే): ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట్లాడుతున్న బీజేపీ నేతలు ముందుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎంతమంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం అందుతున్నదో చెప్పాలని రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో తన నివాసంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రెహమత్ హుస్సేన్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటుంటే, కరీంనగర్ పర్యటనలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని విమర్శించారు. పేద, బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తు మారాలంటే విద్యే ప్రధాన మార్గమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం రూ.2,400 కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కేటాయించి, రూ.2,050 కోట్లను విడుదల చేసిందని తెలిపారు.

### విద్యార్థుల ఖాతాల్లోకే నిధులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని శ్రీరామ్ చక్రవర్తి ఆరోపించారు. అర్హత, అనర్హత, నిధుల దుర్వినియోగంపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో రైతుబంధు తరహాలో విద్యార్థుల ఖాతాల్లోకే నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ చేసే విధానాన్ని ప్రభుత్వం తీసుకువస్తోందని తెలిపారు. ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగ, విదేశీ విద్యా అవకాశాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఫీజు బకాయిలు ఉన్నప్పటికీ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని కళాశాలలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు.

### బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరిస్థితి ఏమిటి?

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చారిత్రక పథకమని శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. ఈ పథకంపై విమర్శలు చేస్తున్న బీజేపీ నేతలు ముందుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకం ఎక్కడ, ఎంతమంది విద్యార్థులకు అమలవుతోందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు జర్మన్, జపనీస్ భాషల్లో శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్‌టీపీఏ వైఫల్యాలపై కేంద్రం సమాధానం చెప్పాలని, రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను ఉపయోగించుకోవద్దని ఆయన హితవు పలికారు.

### కేంద్రంపై అంజన్ కుమార్ విమర్శలు

కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా అధికారంలో ఉందని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం నుంచి వస్తున్న నిధులు, సెంట్రల్ జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల విషయంలో కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అమృత్ పథకం కింద నిధులు తెస్తామని చెప్పిన కేంద్ర మంత్రి ఇప్పటివరకు ఎన్ని నిధులుతీసుకొచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్ ఆర్ఓబీ నిర్మాణం ఏడాది గడిచినా పూర్తికాకపోవడంతో రోగులు, అంబులెన్సులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధుల పేరుతో పరస్పర ఆరోపణలు చేయకుండా వెంటనే ఆర్ఓబీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పీఎం ఆవాస్ యోజనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలను స్పష్టంగా వెల్లడించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఏండితాజ్, వెన్నం రజిత రెడ్డి, మాదాసు శ్రీనివాస్, చింతల్ కిషన్, కూడలి శ్రీధర్, అబ్దుల్ రెహమాన్, అమీర్, కుంభాల రాజు కుమార్, సామ్రాట్, బొమ్మ రాతి సాయి తదితరులు పాల్గొన్నారు.

## 23న ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు రాత పరీక్ష



ఆదిలాబాద్ : జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్ అందిస్తున్నారు. ఈ కోచింగ్‌లో పాల్గొనే అభ్యర్థులకు ఈ నెల 23న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. ఉచిత శిక్షణ పొందాలకునే అభ్యర్థులు తప్పనిసరిగా సమీప పోలీస్ స్టేషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హత పరీక్ష ఆగస్టు 23న ఉదయం 11 గంటలకు ఉందన్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ సబ్ డివిజన్ అభ్యర్థులు అదిలాబాద్‌లోని నలంద కాలేజ్, శ్రీ చైతన్య పాఠశాలల్లో, ఉట్నూర్ సబ్ డివిజన్ అభ్యర్థులు చావర అకాడమీలో ఉంటుందన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు డీటీసీ ఆదిలాబాద్‌లో నిపుణులతో ఉచిత శిక్షణ అందించనున్నట్లు చెప్పారు.



## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీంనగర్ టౌన్: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో రూ.80 లక్షల అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్, యూఐడీఎఫ్ నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, వేణు, మున్సిపల్ అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి




కరీంనగర్, ఆగస్టు 21 (వాయిస్ టుడే): తెలంగాణవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన 22ఏ నిషేధిత భూముల జాబితాలో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం డిమాండ్ చేశారు. వేలాది మంది రైతులు, భూ యజమానుల ఆస్తి హక్కులకు భంగం కలిగించేలా జరిగిన ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన అవకతవకలను సాధారణ పరిపాలనా తప్పిదంగా కాకుండా, వ్యవస్థీకృతంగా జరిగిన వ్యవహారంగా పరిగణించి న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ కంపెనీకి ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు బదిలీ అయినట్లు వస్తున్న ఆరోపణలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. ధరణి, భూభారతి పోర్టళ్లలో గత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు జరిగిన మార్పులు, చేర్పులపై డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని 22ఏ భూముల వివరాలను మండలం, గ్రామం, సర్వే నంబర్ల వారీగా బహిర్గతం చేసి పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పొరపాటుగా నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేటు, పట్టా భూములను తక్షణమే తొలగించి బాధితులకు న్యాయం చేసేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం ఏర్పాటు చేయాలని సూచించారు. భూ రికార్డులను ఉద్దేశపూర్వకంగా మార్చిన అధికారులు, మధ్యవర్తుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సాయిని మల్లేశం డిమాండ్ చేశారు. బీజేపీ లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే రైతుల తరఫున ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, రంగు భాస్కరాచారి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మోతే గంగారెడ్డి, కార్పొరేటర్ ఏపీపీ చంద్ర, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, నాంపల్లి శ్రీనివాస్, అడిచర్ల రాజు, ముత్యాల జగన్ రెడ్డి, గుంజేటి శివ, జగదీశ్వరాచారి, వాసు, సుధాకర్ పటేల్, ఎన్నం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ కార్పొరేటర్లకు పనులు కేటాయించాలి

**వైద్యుల అంజన్ కుమార్**

కరీంనగర్,ఆగస్టు 21(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ పరిధిలోని కాంగ్రెస్ కార్పొరేటర్లకు పనులు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ కార్పొరేటర్లతో కలిసి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లకు వెంటనే అభివృద్ధి పనులు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు వరాల నర్సింగ్, పార్వతుల మల్లేశం,జగన్ రెడ్డి, చారకొండ బుచ్చిరెడ్డి,సరిల్లా ప్రసాద్ పాల్గొన్నారు.




## ఆభరణాలు అపహరించిన నిందితుడి అరెస్టు

తల్లాడ: తల్లాడ మండలంలో రెండిళ్లలో చోరీకి పాల్పడిన నిందితుడ్ని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తల్లాడ, గంగదేవిపాడు గ్రామాల్లోని రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన జంగాల స్వరూప్‌కుమార్ అలియాస్ శాంతిస్వరూప్ అలియాస్ వినయ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు వైరా సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. నిందితుడు గంగదేవిపాడులో సిలివేరు నరసింహారావు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలు అపహరించాడు. అలాగే తల్లాడలో ఓ ఇంటి తాళం పగలకొట్టి రెండు ఉంగరాలు చోరీ చేశాడు. వీటిని గన్నవరం ప్రాంతంలోని జ్యూయలరీ దుకాణంలో విక్రయించారు. పోలీసులు నిందితుడ్ని పట్టుకుని విచారణలో ఆభరణాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. సమావేశంలో ఎస్సైలు ఎన్.వెంకటకృష్ణ, బి.వెంకటేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



## ఎంతటివారైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదు: ఎస్పీ

అశ్వారావుపేట: ఎంతటివారైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, శాంతిభద్రతలను కాపాడే అంశంలో రాజీ పడబోమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. అశ్వారావుపేట ఠాణాను శుక్రవారం సందర్శించిన ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. సర్కిల్ పరిధిలో జూదం, కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పోలీసు అధికారులకు సూచించారు. దొంగతనం కేసుల వివరాలను తెలుసుకున్న ఎస్పీ పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించడంతోపాటు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బాధితులకు తక్షణ సహాయం అందించాలని దిశానిర్దేశం చేశారు.

## వరల్డ్‌కప్ ఐస్‌స్కేటింగ్ పోటీలకు నయనశ్రీ



బోనకల్లు,: స్పీడ్ ఐస్ స్కేటింగ్ జూనియర్ వరల్డ్ కప్ పోటీలకు బోనకల్లు మండలం మోటమర్రి గ్రామానికి చెందిన తాళ్లూరి నయనశ్రీ ఎంపికైంది. ఈనెల 17 నుంచి 20 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియా ఓపెన్ షార్ట్ ట్రాక్ స్పీడ్ ఐస్ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చూపింది. 2026-27లో జరగనున్న జూనియర్ వరల్డ్ కప్‌కి ఎంపిక చేశారు. నవంబరు 2026లో ఇటలీలోని బోరమియోలో, 2027 జనవరిలో కజకిస్థాన్‌లో జరిగే వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైంది. ఆమెను పలువురు అభినందించారు.